బిటకూరి శేషగిరిరావు

"డాక్టర్!"

....

"ప్రసాద్!"

....

"డాక్టరుబాబూ!!!"

వీధి తలుపు ఎవరో బ్రద్దలుకొడుతున్నారు గాఢనిద్రలో నున్న నాకు చాలాసేపటివరకు మెలకువరాలేదు. బయట హోరుమని వర్షం కుండపోతగా కురుస్తోంది తుఫానుగాలి రివ్వుమని వీస్తూ బయట పిలిచే మాటలు లోపలకు వినిపించటంలేదు. బద్ధకంగా లేచి, క్రిందకు వచ్చి తలుపు తీయగానే - సుందరం వాళ్ళ ఫోర్డులో ప్రత్యక్షమయ్యాడు.

"సారీ బ్రదర్! ఈ తుఫాను హోరులో నీ మాటలు వినబడక మెలకువ రాలేదు. పన్నెండు గంటలకు ఒక పురిటికేసు అటెండు అయివచ్చి, అలసిపోయి నిద్రపోయాను. ఇంత ప్రళయంలో కొట్టుకొచ్చే అర్జంటు కేమొచ్చింది? సాయంత్రంవరకూ ఏ గడబిడా లేదే?" అని అడిగాను.

"కమలకు రాత్రినుంచి నొప్పులు తీవ్రంగా వచ్చి ఆగిపోతున్నాయి. నర్సును గంటక్రింద తీసుకొని వచ్చా. కమల చాలా బాధపడుతోంది. అమ్మ నిన్ను అర్జంటుగా తీసుకొని రమ్మన్నది," అన్నాడు సిగరెట్టు అంటించి.

ఇంకొక కేసయితే వెళ్ళటానికి బద్ధకించేవాణ్ణి. కాని – నా చిన్ననాటి స్నేహితుడు సుందరం. అంతటి తుఫానులో నన్ను వెతుక్కుంటూ వస్తే – కాదనే సాహసం లేకపోయింది.

సుందరం, నేనూ ఒకే కాలేజీలో చదువుకున్నాం. అతను బి.యల్. కోసం మదరాసు వెడితే, నేను మెడిసన్ కోసం విశాఖపట్నం వెళ్ళాను. వారం రోజుల క్రిందటే యీ వూరి హాస్పటల్‌కు బదలీ అయివచ్చి ఛార్జీ తీసుకున్నాను. చదువుకునే రోజుల్లో మేము ఏకోదరుల్లా మెలగటంతో మా స్నేహం అంత బలీయమైపోయింది.

మేము వెళ్ళేటప్పటికి యింట్లో అంతా కంగారుపడుతున్నారు. సుందరంభార్య కమలకు పురుటిరోజులు. ఉదయంనుండీ ఆమెకు నొప్పులు రావటం – ఆగిపోవటం జరుగుతోంది. రాత్రి పన్నెండు గంటలనుంచీ ఆమెస్థితి ఏమీ బాగోలేదనీ, ఇక్కడ పురుడు రావటం కష్టమనీ నర్సు నాకు కబురు చేయమన్నదట. నేను చాలా శ్రద్ధగా పరీక్ష చేశాను. కాంప్లికేషన్సు ఏమిటో తెలియటంలేదు. హార్టూ, పల్సూ అన్నీ బాగానే ఉన్నాయి. రెండునిముషాల కోసారి నాడిఅందటం లేదు. ఉండుండి కాళ్ళూ, చేతులూ చల్లబడుతున్నాయి. నా అనుభవంలో యిలాటి పరిస్థితిని ఎప్పుడూ ఎదుర్కొనలేదు. పాపం! కమల బాధతోనూ, ఆయాసంతోనూ నీరసించిపోతోంది.

ఆ స్థితిలో నాకు ఏమి చేయటానికీ పాలుపోలేదు. పిఠాపురంలోని మిషను ఆసుపత్రికే తీసుకొనిపోవటం శరణ్యమనిపించింది. ఇంటిల్లపాదీ బెంగతో తల్లడిల్లిపోతున్నారు. నా అభిప్రాయం వెల్లడించగానే పెట్టే, బెడ్డింగూ సర్దుతున్నారు. ఇంతలో సుందరం చెల్లెలు అప్రయత్నంగా "ఈ సమయంలో మహాలక్ష్మిపిన్ని వుంటే ఎంతబాగుండే" దంది.

ఆ మాట అనగానే సుందరం తల్లి రమణమ్మగారు తూలుతూ వచ్చి "నాయనా! సుందరం! ఎందుకురా మీరంతా బెంగపెట్టుకొని కంగారు పడతారు. మిమ్మల్ని నేను మరచిపో



లేదురా! మీ రేమీ కంగారు పడకండి. మీ ప్రయాణం మానుకోండి. పిల్లదానికి పురిటాలి గాలి సోకింది. నేను రాగానే అది తొలగిపోయింది. అది ఉదయం నుంచీ పిల్లదాన్ని నానాహింస పెట్టింది. ఇహ ఏమీ దిగులులేదు. అయిదునిమిషాల్లో ఆడపిల్ల పుడుతుంది. మళ్ళీ మీ యింట్లో నేను వెలుస్తున్నా. పిల్లదానికి నా పేరు పెట్టండి. భయపడకండి,'' అని చెప్పింది.

ఇంటిలోనివారంతా భయభక్తులతో ఆమెకాళ్ళకు మ్రొక్కారు. ఆమె కమల తలను ఆప్యాయంగా నిమురుతూ "కోడలా! మళ్ళీ నీ కడుపున పుడుతున్నా! నన్ను జాగ్రత్తగా చూచుకో," అన్నది.

కొబ్బరికాయకొట్టి హారతికర్పూరం వెలిగించారు.

సరిగ్గా ఆమె అన్న అయిదునిమిషాలకే ఏ కంగారూ లేకుండా కమల ఆడపిల్లను ప్రసవించింది. ఇంటిల్లిపాదీ 'మామ్మ' వెలసిం దని ఆనందంతో మైమరచిపోయారు.

నా ఆశ్చర్యానికి మేరలేదు. సామాన్యంగా నేను దేముడూ, దెయ్యమూ అనే మూఢనమ్మకాలను లెఖ్ఖచేయను. అందులో యీ వృత్తి అవలంభించాక – ఆ మూఢనమ్మకాలమీద అసహ్యం కూడా పుట్టుకొచ్చింది. కాని ఆ నాడు జరిగిన సంఘటన – నా జీవితంలో మరుపురానిది. వైద్యశాస్త్రంలో చాలా దిట్టయని పేరుపొందినవాణ్ణి, ఎంతో

నేర్పరినని గర్వపడే నాకు – ఆనాడు శృంగభంగ మైంది మనిషి చావుబ్రతు కుల మధ్య ఊగిసలాడుతూ – అనుభవసీయుల మనే డాక్టర్లనే తికమకపెట్టి బోల్తా కొట్టించి – క్షణంలో తన కరుణావీక్షణ ములచే అందరినీ ఆనందసముద్రంలో ముంచిన – ఆ అమోఘ, అజ్ఞాతశక్తికి రెండుచేతులూ మోడ్చి జోహారు లర్పించ కుండా వుండలేకపోయాను.

* * *

తెల్లవారంగానే మొహాలు కడుక్కుని కాఫీ తాగుతున్నాం. ఇహ ఆ అజ్ఞాతశక్తి ఎవరో కనుక్కోవాలనే కుతూహలాన్ని ఆపుకోలేకపోయాను

"ఎవరోయ్! నిన్న మీ అమ్మగారి వంటిమీద పూనింది," అని అడిగాను.

సుందరం సిగరెట్టుముట్టించి, ఒక వేడి నిట్టూర్పు విడిచి, "అది ఒక విచిత్రమైన పవిత్రమైన – ప్రబంధగాధ! – మా కుటుం బానికి పవిత్రమైన అనుబంధం! మనం చదివిన గ్రంధాలలో ఇలాంటి అపూర్వ సంఘటనలు సామాన్యంగా కానరావు.

"సుమారు నలభై యేండ్ల క్రిందట జరి గిన పవిత్ర ప్రేమగాధ చెప్పుతున్నా మా నాన్నకు అప్పుడు యిరువయి ఏళ్ళుంటాయి. కాలేజీలో బి ఏ. చదువు తున్నాడు. నువ్వుకూడా ఆయనను చూచే వుంటావు మనిషి అజానుబాహుడు, మంచి అందకాడు. వ్యాయామంలో నిధి అవటంచేత, కండలుదేరిన పచ్చని శరీ రంతోనూ, నూనూగు మీసాలతోనూ, ఉంగరాల జుట్టుతో, కాశీమజిలీలు వర్ణించే రాచకుమారిడిలావుండేవాడు. అతిసాహసి భయమంటే ఏమిటో ఎరుగడు చిన్న ప్పటినుంచీ తన సాహసకృత్యాలతో ఎంతోమంది ప్రాణాలు కాపాడినాడట కాలేజీలో రింగుమీదా, బారుమీదా గొప్పగొప్ప సాహసమైన పనులు చేసే వాడట. కాలేజీలో వందపైగా బహు మతులు మా నాన్నకే వచ్చేవట. కాలే జీకి ఆల్ రౌండు ఛాంపియన్.

"మా నాన్నకు రామచంద్రరావు అనే సహాధ్యాయి వుండేవాడు అతనిది కోన సీమ. అతను మా ఇంట్లోనే వుంటూ నాన్నతో కాలేజీలో ఒకేతరగతి చదు వుతూ వుండేవాడు. ఇద్దరూ ఏకోద రుల్లా వుంటుండేవారు. అతడు నాన్నను శలవల్లో వారి వూరికి తాను కొనిపో తుండేవాడు. చూసేవాళ్ళంతా వారిని రామలక్ష్మణులని ముచ్చటగా పిలిచేవారు.

"అవి మండువేసవిరోజులు. కాల వల్లో నీరు లేదు. నాన్న, రామచంద్రం, మునసబుగారబ్బాయి, మరోయిద్దరు రాచకుర్రాళ్ళూ కలసిబేస్తు ఆట ఆడుకుం టున్నారు. ఆట మంచిరసపట్టులోవుంది. ధనలక్ష్మి గలగలా మ్రోగుతోంది. క్రింద రెండుబేస్తు లున్నాయి. సిగరెట్లపొగ గదినంతా ఆవరించింది.

"రెండుగంటల సమయం. వేడి గాడ్పులు గూబల వగలకొడుతున్నాయి.

కుక్కలుకూడా సంచారం మాని నాలుకలు జాపి వగరుస్తూ - చెట్లనీడల్లో పరున్నాయి. రోడ్డు నిర్మానుషంగా వుంది. ఇంతలో గుప్పుమని ఆకాశంలో పెద్దపొగ లేచింది.

" 'రాచపేటకు నిప్పంటుకుంది. కొంపలు తగలబడుతున్నాయి లేవండి! లేవండి!' " అంటూ జనం కేకలేస్తూ పరుగెత్తుతున్నారు.

"నాన్న పేకముక్కలు పారేశాడు బృందమంతా బిలబిల్లాడుతూ రాచపేట జేరుకుంది అప్పటికప్పుడే రెండు మూడు యిళ్ళు పరశురామ ప్రీతి అయ్యాయి. జనం కంగారులో చిందులు త్రొక్కుతున్నారు ముందు మండుతోన్న కొంపలను ఆర్పివేయక - మిగిలిన యిండ్లను తడుపుతున్నారు. దానివలన గ్రామమంతా తగులబడే ప్రమాదం కనుపిస్తోంది వారి అవివేకానికి నాన్నకు కోపమూ, విచారమూకూడా కలిగింది

"జనాన్నికూడదీసుకున్నాడు. ఇండ్లలోగల విలువైనసామానులన్నింటినీ సురక్షితమైన స్థానానికి జేర్పించాడు. పెద్ద పెద్ద వెదురుబొంగులలో కాలుతూన్న తాటియాకుల చూరును క్రిందకు కూల్చివేయించి - మంటలు పైకి ఎగబ్రాకకుండా అరికట్టించేశాడు. వీరావేశంతో గోడలమీద నిలుచుండి అగ్నిహోత్రునితో పోరుతున్న నాన్నను చూచి, జనం రెట్టించిన ఉత్సాహంతో అతనికి సాయం చేశారు. ప్రాణాలకూడా తెగించి మండుతూన్న యిండ్లలోకి జొరపడి రెండు మూడు ప్రాణాలను రక్షించాడట.

"మంటలు అదుపులోనికి వచ్చే సమయంలో హఠాత్తుగా గాలి విజృంభించింది. వీధిచివరనున్న మేడ అంటుకున్నది. చూస్తుండగానే మంటలు తీవ్రరూపం దాల్చి మేడచుట్టూ ఆక్రమించుకున్నాయి. విలువైన సామానులూ, పశువులూ మాత్రం బైటకు జేర్పబడ్డాయి. ఉన్నట్టుండి రామరాజుగారి కుటుంబంలోంచి "హాహా కారాలు బయల్దేరాయి.

" 'అమ్మాయి కాలిపోతోంది, రక్షించండి! రక్షించండి,' " అని రామరాజుగారు గుండెలు బాదుకుంటున్నారు

"వేలకొలదీ జనం ఆ భవనంముందు గుమిగూడి అచేతనులైయున్నారు. రామరాజుగారి ఏకైకపుత్రిక మహాలక్ష్మి మేడగదిలో చిక్కుకుపోయింది. అవరణమట్టూ నిలవయుంచిన కలపా, మంచాలూ అంటుకొని జ్వాలలు పైకి లేస్తున్నాయి. నిచ్చెనలు వేసి పైకి వెళ్ళటానికికూడా అవకాశం లేదు. నాన్న యువకబృందంతో అక్కడకు వచ్చాడు. ఆయన అప్పటికే బాగా అలసివున్నాడు. చెమటలకు కాలిన మసి శరీరమంతా

అంటుకుంది. అక్కడక్కడా కాలిన చిన్నచిన్న గాయాలు కన్పిస్తున్నాయి.

"మేడమీదకు వెళ్ళేసాధనం ఎవరికీ తోచటంలేదు. క్రిందభాగమంతా భగభగ మండుతూన్న మంటలచే నిండివుంది. రాజుగారి కుటుంబం వీధిలోపడి రోదిస్తోంది. ఇంతలో మేడమీది గదిలోంచి పదునెనిమిదేండ్ల బంగారు విగ్రహం భయభ్రాంత చేతస్కయై 'నాన్నగారూ!' అంటూ కెవ్వున కేకవేసింది.

"జనమంతా ఆ యువతిని చూచి 'హాహాకారాలు చేస్తున్నారు. అప్పుడే మేడమీది పెంకుటిచూరుకూడ అంటుకున్నది. రామరాజుగారు అందరివైపూ దీనంగా చూశారు. 'ఇంతమందిలోనూ కుమార్తెను రక్షించే మగాడే లేడా!" ఆమెను కాపాడినవాడికి లక్షరూపాయలిస్తా!' నన్నాడు

"క్షణం అంతా నిశబ్దం! డబ్బుమీద ఆశకొలదీ కొందరు ప్రయత్నించారు. కాని అప్పటికే చేతులు మించిపోయినందున - బ్రతికుంటే బలుసాకన్నా తినవచ్చుని - ధనాని కాసించి ప్రళయ దావాగ్నిని సమీపించలేకపోయారు.

నాన్న శరీరంలో బలంతగ్గినా - ఆవేశం తగ్గలేదు. కేవలం అచేతనుడుగా - నిస్సహాయుడై, కన్నకుమార్తె కొరకు దీనంగా విలపిస్తున్న ఆ వృద్ధిని చూచి జాలికలిగింది. తన జీవితాన్ని బలిపెట్టి అయినాసరే, ఆ యువతి ప్రాణాలను రక్షించా లనుకున్నాడు. క్షణకాలం చుట్టూ ఉన్న పరిసరాలకేసి దృష్టి సారించాడు.

"ఆ మేడకు సుమారు వందగజాల్లో ఒక పెద్దచింతచెట్టు వుంది. మేడకు సమీపంలోనున్న కొమ్మపై దృష్టి నిలిపాడు బయటపడవేసిన సామాను లోంచి రెండు గట్టి మోకుతాళ్ళను తీశాడు. ఒకయువకుణ్ణి చెట్టుపైకి ఎక్కించి ఆ తాటిని తాను చూచిన కొమ్మకు బలంగా ముడివేయించాడు. భూమినుంచి అయిదు అడుగుల ఎత్తులో ఆ తాటికి రెండవ తాడు ముడి వేయించాడు.

"అప్పటికే మేడమీద మంటలు తీవ్ర రూపం దాల్చాయి. ఆ యువతి భయముతో ఆర్తనాదం చేస్తోంది. నాన్న తన యిష్టదైవమైన ఆంజనేయుణ్ణి స్మరించాడు ఒక్కసారి ఆవేశంతో శరీరం ఉప్పొంగింది. అతడు ఆ తాటి మధ్యభాగాన్ని చేరుకున్నాడు. రెండవతాటిని సుమారు యిరువైమంది యువకులను చాలాదూరంవరకు లాగి వదలమన్నాడు. ఆ వూపులో నాన్న పట్టుకున్న తాడు మేడ సమీపంలోకి వెళ్ళింది.

"ఇందులోని కిటుకు అందరికీ తెలిసింది. ఈసారి రెట్టించిన ఉత్సాహంతో జనం శక్తినంతా వినియోగించి తాడు లాగి వదిలారు. ఈసారి నాన్న - సినిమాలోని టార్జనులా ఆకాశంలో ఊగుతూ వెళ్ళి మేడవసారాలోకి



దుమికి — ఆ తాటిని అక్కడ నున్న కొయ్యకు బిగించాడు.

"కాని మేడమీద నిలుచున్న యువతి ఎవ్వరికీ కన్పించటం లేదు. పది పదిహేను నిముషాలు గడచిపోయాయి. మేడ పైకప్పుకూడా కాలిపోయింది. నాన్నకూడా కాలిపోయివుంటాడని క్రింద నున్న జనం హాహాకారాలు చేస్తున్నారు. అప్పటి కప్పుడే కొంతమంది బిలబిల్లాడుతూ చెట్టుకొమ్మల కెక్కి మేడమీద ఏమి జరుగుతోందనని ఆత్రుతతో చూస్తున్నారు.

"అంతలోనే

తనురాలైన

తాటిని బల

యు

మాన్!' అని ఒక కేక వేసి, ప్రక్క నున్న గోడను ఒక్క తన్ను తన్ని ఆకాశంలోకి ఎగిరాడు.

"ప్రజలలోనుండి విచిత్రం! అద్భుతం!! అనే కేకలు వినిపించాయి. క్రింద పగ్గం పట్టుకున్నవారు మెల్లగా తాటిని చేదుకున్నారు. నాన్న తాటి నుండి మెల్లగా క్రిందకు జారుకున్నాడు.

"జనంలోని అప్పటి

ఆనందం వగి

గా

నిష్కపటి. పరోపకారపరాయణుడు. ఆనాటి ఆ దివ్యశక్తి కేవలం ఆంజనేయ వరప్రసాదితమే !

"తాడుమీంచి ఆ భారాన్ని క్రిందకు దించగానే నాన్నకు స్పృహ తప్పింది. నాన్నను రామచంద్రం యింట్లో పరుండ బెట్టారు. ఆ యింటికి సమీపంలోనే యున్న యింకొక యింటిని రామరాజు గార్కి తాత్కాలికంగా విడిదిగా యిచ్చారు. అగ్నిహోత్రుడుకూడా యీ సాహసకార్యానికి అద్భుతమంది శాంతి వహించాడా అన్నట్లు అంతటితో అగ్ని భయం తొలగిపోయింది.

"ఆ సాయంత్రం గ్రామంలోని యావత్తు ప్రజలు రామచంద్రంగారి యిట్టివద్ద జేరారు. అమలాపురంనుంచి సిద్ధమైన యిద్దరు డాక్టర్లు వచ్చారు. నాన్న ఆరోగ్యంగురించి క్షణక్షణం ఆందోళన వృద్ధికాసాగింది. తమ జీవితంలో అలాంటి సాహసకార్యం కని, విని ఎరుగమని నాన్న వీరత్వాన్ని వేనోళ్ళ పొగడుతున్నారు. చివరకు డాక్టర్లు, నాన్ననీ ఆ యువతినీ పరీక్షించి వారికి ఏవిధమైన ప్రమాదమూ లేదని నచ్చచెప్పిన తరువాతగాని జనం ఇండ్లకు పోలేదు. ఆ రాత్రికి రాత్రి రామ

...రి కారు మా తాతను, నాయ
...ని రావటానికి వెళ్ళింది.
...నాన్న కళ్లు తెరి
...శులు

వచ్చి మంచందగ్గర కూర్చుండి తమ కుమారుని వీరోచితకార్యానికి ఆనంద భాష్పాలు రాలుస్తున్నారు.

"నాన్న కళ్ళుతెరవగానే 'రామూ ! ఆ అమ్మాయి బ్రతికిందా ?' అని హీన స్వరంతో అడిగాడు. ఆ అమ్మాయి కులాసాగా వుందని విని మళ్ళీ మగత నిద్రపోయాడు.

"ఆరోజు సాయంత్రానికి యిద్దరికీ ఆరోగ్యం చేకూరింది. రామరాజుగారు నాన్నను కౌగలించుకొని ఆనందం పట్ట లేక, అంతమందిలో ఏడ్చేశారు

"రెండోరోజు మా నాన్న మావూరు వచ్చేశాడు. వచ్చేముందు మా నాన్న ఆ యువతిని చూశాడు. ఆయన్ను చూడ గానే ఆ యువతి భయ, వినయ, లజ్జా సంభ్రమములతో నమస్కారం చేసి ప్రాణదాతకు కృతజ్ఞత వెల్లడించుకుంది. ఆ గ్రామవాసులు సన్మాన పురస్కారంగా ఆయనకు వీడ్కోలు యిచ్చారు. ఆ చుట్టుప్రక్కల గ్రామాలన్నిటికీ ఆనాటి వీరోచితగాధ ప్రచారమైంది రామరాజు గారు తన వాగ్దానాన్ని నిలుపుకుందామని ఎంతో ప్రయత్నించారు. కాని వారి ప్రతి ప్రయత్నమూ భగ్నపరిచాడు నాన్న.

"ఈ సంఘటన జరిగిన రెండు నెలలకు మా నాన్న వివాహం గొప్ప కట్నంతో వైభవంగా జరిగింది.

"ఈ సంఘటన జరిగిందగ్గరనుంచీ రాజుగారి కుటుంబంలో తీవ్రమైన అం

దోళన బయలుదేరింది. రాజుగారు మంచి సాంప్రదాయమైన కుటుంబం లోనివారు. ఆయన సుమారు రెండువందల ఎకరముల భూమికి ఖామందు. జిల్లా అంతటికీ మంచి పేరుమోసిన వ్యక్తి. పరోపకార పరాయణుడూ, సాత్వికుడూ. వారికున్న సంతానమంతా పెద్దది కుమార్తె లక్ష్మి, రెండవ సంతతి కుమారుడు. లక్ష్మి పదునెనిమిదేండ్ల బంగారు ప్రతిమ. కేవలం దేవతలలో గల సర్వ సుగుణ సంపదలతో మూర్తీభవించిన సౌందర్యమూర్తి. అంత పిన్న వయస్సులోనే సంస్కృతంలోనూ, తెలుగులోనూ మంచి పాండిత్యం సంపాదించింది.

"ఒకత్తే ఆడపిల్ల గనుక తలిదండ్రులు అల్లారుముద్దుగా పెంచి, మంచి సాంప్రదాయమైన సంబంధం చూచి వివాహం బ్రహ్మాండంగా చేయాలని మురుస్తుండేవారు. ఎన్నో గ్రామాలూ, పట్టణాలూ తగిన వరునికోసం గాలించారు. కాని ఆ కోరిక ఏం ఫలించలేదు. ఆనాటినుండీ లక్ష్మిలో పూర్తిగా మార్పు వచ్చింది. ఆమె ప్రతిదినమూ ఉదయమే లేచి కాలకృత్యాలను తీర్చుకొని, తులసి పూజ చేసుకుని, ఆతరువాత యిష్టదేవతాపూజ చేసుకునేది. ప్రతినిత్యమూ విధిగా సుందరాకాండ పారాయణచేసేది.

"తనకుతలిదండ్రులు వివాహ ప్రయత్నం చేస్తున్నట్లు తెలుసుకొని–తాను తన జీవితంలో వివాహం చేసుకొనని చెప్పింది. గంపెడాశతో నున్న తలిదండ్రుల కిది పిడుగుపాటైంది. కుమార్తె నిశ్చయాన్ని మార్చటానికి బంధువుల చేతా, పెద్ద లందరిచేతా చెప్పించారు. విశ్వప్రయత్నం చేశారు. కాని లాభం లేకపోయింది. కారణం చెప్పమని ప్రతిమాలారు. ఆమె చెప్పిన కారణాన్ని విని నిశ్చేష్టులైనారు.

తాను సుక్షత్రియజాతికన్య. పరిణయమాడినభర్త తప్ప యితరులస్పర్శాజ్ఞానం తనకు కూడనిది. తాను నిస్సాహాయురాలుగా వుండి–దారుణాగ్నికి ఆహుతి అయే సమయంలో–జీవాన్ని తృణప్రాయంగా ఎంచి–మానవాతీతమైన, వీరోచిత సాహస కార్యంతో తనకు ప్రాణదానం చేసినవాడే తన నాధుడు. ఇదియే తన మనో నిశ్చయం। జీవిత పరమావధి।। భగవత్సంకల్పమూను।।।

రాచకుటుంబంలో యీమె సంకల్పం గొప్ప సంచలనాన్ని కలిగించింది. ఇంతకుముందు కనీ వినీ ఎరుగని సాంప్రదాయం, ఇంకా పూర్వాచారాలను విడవటానికి అలవాటుపడని రోజులు. అందులో క్షత్రియజాతి పట్టుదలలు మరీ నిరిష్టమైనవి. ప్రతిరోజూ యింట్లో తర్జనభర్జనలు జరిగాయి. రాను రాను లక్ష్మి మనో నిశ్చయం దృఢమౌతూ, ఆమె తపోబలం వృద్ధియౌతోంది.

రాజుగారికి అనాడు తనకుమార్తె అగ్ని

పోత్రంనుండి రక్షింపబడి సందులకు సంతోషించలేకపోవలసివచ్చింది. ప్రస్తుతపు క్లిష్టపరిస్థితిని ఎట్లు ఎదుర్కొనడమనేదే ఆయనకు తీరని సమస్య అయింది. ఆయన తన స్వజనులతో యీ విషయం ముచ్చటించారు. ఎవరికి తోచిన అభిప్రాయాలు వారు చెప్పారు. ఏపని చేయటానికి తనకు సాహసం చాలటంలేదు. రాజుగారు పెద్ద పెద్ద పండితులను కలుసుకొని కుమార్తెకు వివాహయోగం వుందనీ ఆమె భర్త మంచి ఉన్నత వంశంలోని వాడనీ, ఆమె పుట్టింటికీ మెట్టింటికీ ఎనలేని కీర్తి తెస్తుందనీ తెలిపారు. రాజుగారు చివరలో యీ విషయం రామచంద్రం తండ్రిద్వారా మా తాతకు తెలిపారు వారిలోవారు తర్జనభర్జనలు జరుపుకున్నారు. ఇలా మరో ఆరునెలలు గడిచాక ఒకదారిలోకి వచ్చారు. క్షత్రియ కన్యను బ్రాహ్మణుడు పరిణయం చేసుకోవటం శాస్త్రసమ్మతమే ననీ, కేవలం యీ సంఘటన దైవబలంతో కూడినదిగా తోచటంచేత — యీ వివాహం విధిగా జరుపవచ్చని — కాని లక్ష్మి అత్తవారింట్లో — ఆమెకు యితరులతో సంబంధంలేకుండా — ఆమె రాచమర్యాదలకు లోటులేకుండా వుండేట్టు ఆమెకు ప్రత్యేక భవనంలో వుంచే నిబంధనమీద — వివాహం అతి వైభవంగా జరిగింది.

రాజుగారు కుమార్తెకు యాభై ఎకరాల మాగాణిభూమి, యాభై వేల విలువచేసే ధనకనకవస్తువాహనములు సమర్పించుకున్నారు.

మా తాతగారిదీ సంపన్న కుటుంబమే గనుక మాయింటివెనుకనున్న సుమారు ఎకరం ఆవరణలో ఒకచిన్న బంగళా నిర్మించి, దానిలోనే ఒక పూలతోట, కొలను నిర్మించి రాచ కుటుంబమునకు కావలసిన ఏర్పాట్లన్నీ చేశారు

మొదట్లో యీ వివాహం మాఅమ్మకు సుతారమూ యిష్టంలేదు. సవతివస్తే తననాధుడు తన్ను అనాదరంతో చూస్తాడేమోనని భయపడింది. కాని — మాపిన్ని వచ్చిన కొలది కాలంలోనే ఆమె సుగుణసంపదలకు వశురాలైపోయింది. ఆమె అత్తవారింటికి వచ్చినది మొదలు చనిపోయేవరకూ ఏనాడూ మా అమ్మకూ, ఆమెకూ మధ్య మనస్పర్ధలు కలుగలేదు ఇద్దరూ ఏకోదరుల్లా కలసి మెలసి యుండేవారు. ఆమె సహచర్యం వలన అమ్మ ఎంతో వివేకాన్నీ విజ్ఞానాన్ని సంపాదించింది

ఆమె మాయింటికివచ్చిన ఏడాదికి నేను పుట్టాను. తరువాత యిద్దరు ఆడపిల్లలు పుట్టారు. మా అందరిపోషణా ఆమెదే. మాఅమ్మ వద్దకంటె ఆమెదగ్గరే మేము చనువుతో ప్రేమతో మెలిగే వాళ్ళం.

అమె యిల్లువిడిచి ఎక్కడకూ వెళ్ళి ఎరుగదు. ఉదయం లేవగానే — కాల



కృత్యాలను తీర్చుకొని, తులసిపూజా పతిపూజా చేసుకుని – మిగతాకాలంలో పిల్లలను చేరదీయటం – వారికి విద్యా బుద్ధులు నేర్పటం – వారి ఆరోగ్యాన్ని సరిచూడటంలో సరిపోయేది

ప్రతిరోజూ మధ్యాహ్నం – ఆమె భవనంలోని చావిడిలో – స్వయంగా ఆమె పురాణ కాలక్షేపం చేస్తుండేది. సుమారు యాభై మంది దాకా యిరుగుపొరుగు గృహిణులు వస్తుండేవారు శ్రావ్యమైన కంఠం! స్వచ్ఛమైన వాక్పటిమ వచ్చిన స్త్రీలందరూ పురాణంవిని ముగ్ధులౌతుండే వారు. ప్రతి పర్వదినం ఆమె బ్రాహ్మణ సత్కారం చేస్తుండేది. రానురాను ఆమె కీర్తి దశదిశలా వ్యాపించింది. ఆమె వలన సత్కారం పొందిన పండితులూ, సాయంపొందని దీనులూ, లేరంటే అతిశయోక్తికాదు. ప్రతి సంవత్సరం దేవీనవరాత్రులు అతి వైభవంగా జరిపి పండితసత్కారం, అన్నదానం విరివిగా జరిపేది

మా అందరి పెంపకపుభారం ఆమే వహించేదని ముందే చెప్పాను. ప్రతి రోజూ మాకు రామాయణ, భారత, భాగవతాల్లోవి కథలు చెప్పేది. పెద్దల యందు వినయవిధేయతలు ఎట్లు ప్రదర్శించాలో, పాఠశాలలయందు గురువులపట్ల ఎట్లు శ్రద్ధా, భక్తి ప్రమత్తలతో మెలగాలో బోధించేది తప్పు చేసిన వారిని ఆమె విచిత్రంగా శిక్షించేది. ఆశిక్ష మరణశిక్షంటే కఠినంగావుండేది ఆదేమంటే – ఆ తప్పుచేసినవారితో ఆమె మళ్ళీ వారు క్షమార్పణ కోరేదాకా మాట్లాడేదికాదు ఇరవైనాలుగ్గంటలూ,

ఆమె కనుసన్నల్లో మెలగుతూ ఆమె అనురాగామృతాన్ని చూరగొనే యీ దీనులకు ఆమెశిక్ష నిజంగా కఠిన నరకంగానే వుండేది.

అందువలన యింట్లోని పిన్నలూ, పెద్దలూ, దాసదాసీజనం కూడా ఆమె అంటే ఎంతో గౌరవంతో, ప్రేమతో వుండేవారు. మాలో ఎవరికైనా కొంచెం జ్వరంవస్తే - రాత్రింబవళ్ళు మా ప్రక్కదగ్గర వేచియుండి సేవ చేసేది. మందు మాకులుకన్నా - రోగికి ఆమె అమృతహస్త స్పర్శమాత్రాననే రోగం మటుమాయ మయేది. ఆమె ఆదరమూ, ప్రేమా, అనురాగమూ మమ్మ ముగ్ధలను చేసేది.

మా పిన్నిగురించి యింట్లోవారూ, బయటివారూ వింతగా చెప్పుకునేవారు. ఆమె శాపవశంచేత భూలోకంలో అవతరించిన దేవకన్య అనీ - మా నాన్న పూర్వజన్మ సుకృతంచేతే - యీ జన్మలో మానాన్నకు ఆమె భార్యగా అవతరించిందని చెప్పుకునేవారు. మాపిన్నికి కలిగిన లోటల్లా ఒకటే ! ఆమెకడుపు ఫలించలేదు ఏనాడూ ఆమె ఆలోటునుగురించి విచారించలేదు. పైగా మేమే ఆమె సంతానమని, మా గుణగణాలను పొగడుతూ మురిసిపోయేది. మాయింటికి వచ్చిన తరవాత ఆమె పుట్టింటికి ఒకటి రెండుసార్లు మాత్రమే వెళ్ళింది.

ఆమె జీవించివున్నంతకాలమూ మాయింట్లో లక్ష్మి తాండవమాడుతుండేది. మా కుటుంబ యాజమాన్యమంతా ఆమే వహించేది. మా కుటుంబమునకు కావలసిన సమస్త వస్తువాహనాలు ఆమె చేతులమీదుగా వచ్చేవి. మా అందరిపెళ్ళిళ్ళూ, కట్నాలూ, కనకమూ ఆమె సొంతసొమ్ముతోనే జరిపించేది. అందరూ ఆమె మాటనే వేదవాక్కులా శిరసావహించేవారు. ఆమె ఆదరణ అపూర్వమైనది. ఎవరికి ఏ సమయంలో ఏది అవసరమో - చూపుతోనే గ్రహించి వారికి అవి సమకూర్చి సంతృప్తి పరుస్తుండేది.

ఆమె పుట్టినప్పటినుండే శాఖాహారి. మహాభక్తురాలు. నియమనిష్ఠలుగలది. అన్ని పుణ్యతిధులలో ఉపవాసములుండి దైవ బ్రాహ్మణ పూజలు సల్పేది. అన్నింటికీ మించినది ఆమె పతిభక్తి నా అనుభవంలో అంతటి మహాప్రతివ్రతను ఎరుగను. నిజంగా అలాంటి పవిత్రదేవతామూర్తిని భార్యగా పొందినందులకు మా నాన్న ధన్యుడనే నేను యిప్పటికీ మురుస్తుంటాను.

ఇప్పటకి సుమారు అయిదు సంవత్సరాల క్రిందట జరిగిన సంగతి అప్పటికి ఆమెకు యాభైఏ ళ్లుంటాయి. యాభైఏళ్ళ వృద్ధాప్యం వచ్చినా - ఆమెలోని యవ్వనం, లావణ్యం, సౌకుమార్యం చెక్కుచెదరలేదు. నిత్యయవ్వన సుందరాంగిలా వుండేది దేవతలా.

ఉత్తరాలు రాయించి మా కుటుంబం లోని వారినందరినీ రావించింది. అందరికీ చక్కటి ఖరీదైన బట్టలు కొని యిచ్చింది. ఇనపెట్టెలోంచి తన విలువైన నగలన్నీ తీసి అందరికీ పంచిపెట్టింది. పిల్లలందరికీ మిఠాయి తెప్పిచ్చి పెట్టి వారితో ఆప్యాయంగా, చిన్నపిల్లలా ఆడుకుంది. వారికి ఎన్నో నీతులు బోధించింది. ఆమె ప్రవర్తన మాకు అర్థం కాలేదు.

ఆరోజు భీష్మ ఏకాదశి. పిన్నిరోజు కంటే ఆరోజు పెందరాళే లేచింది. కాలకృత్యాలన్నీ తీర్చుకుంది. బ్రాహ్మణులను, పుణ్యస్త్రీలను పిలిపించి, అంతకుముందే తాను తెప్పించియుంచిన శాలువలూ, దండలూ, చీరలూ, చెంబులూ, వెండి బంగారంతో సత్కరించింది. ఆమె చేసే ప్రతిపనికీ కారణం అడిగే సాహసం ఎవరికీ లేకపోయింది.

దానధర్మాలు అన్నీ అయాయి. పదకొండు గంటలకు అందరి భోజనాలూ అయ్యాయి ఆమె జపం చేసుకుంటున్న పూజా మందిరానికి మేమంతా వెళ్ళాము. పన్నెండు గంటలైంది. ఆమె జపం ముగించుకొని మా అందరినీ పేరుపేరునా పిలిచి దీవించింది. ఆమె కళ్ళలో నీళ్ళు నిండాయి. మా అమ్మను పిలిచి "అక్కగారూ !" అంటూ కౌగలించుకుంది. మా అమ్మ పాదాలకు నమస్కరించి – "అక్కగారూ ! ఇన్నాళ్ళూ భర్తగారి బాధ్యత మన యిద్దరం వహించాము. ఇకముందు ఆ భారం మీరే వహించాలి. ఇన్నాళ్ళూ నేను ఇతరకులందాన్ననే భేదంలేకుండా సొంతచెల్లెలిలా ఆదుకొని కాపాడిన మీ ఋణాన్ని తీర్చుకోలేను. జీవితంలో ఎప్పుడైనా మిమ్మ నొప్పించి యుంటే నా అపరాధాన్ని మన్నించాలి.'' అని అమ్మ పాదాల్ని కళ్ళ కద్దుకుంది. ఆ నాటి ఆమె విచిత్ర ప్రవర్తనకు అర్థం తెలియకఅమ్మ బిత్తరపోయి చూస్తోంది. తరువాత నాన్నను కుర్చీలో కూర్చుండబెట్టి, ఆయన పాదాలు వెండిపళ్ళెంలో వుంచి పాదములు కడిగి ఆ యుదకాన్ని సిరస్సుపై జల్లుకుంది. ఆయన పాదాలు తుడిచి పూలతో పూజించింది. అప్పుడే ఆమెను చూచుటకు వచ్చిన పండితులు వేదపఠనం ప్రారంభించారు. ఆమె పూలమాలను నాన్న మెడలో వేసింది.

అక్కడ చేరిన ప్రజానీకా నంతటికీ చేతులు జోడించి నమస్కరించి "ఇంత కాలమూ మీరందరూ నాయందు పుత్రికా వాత్సల్యంతో ఆదరించి నందులకు నా ధన్యవాదములు. నా పూర్వజన్మ సుకృతమువలన ఈ మహానుభావుని, సాహసోపేతుని, ఉత్తమపురుషుని, పరాక్రమవంతుని వరించి, పరిణయమాడి – వారి అపూర్వానురాగాన్ని చూరగొని తరించాను. నేటితో యీ మహాత్మునితో ఎడ

బాటు కలుగబోతోంది అనే విచార మున్నా - జన్మజన్మాలకూ ఇక్కడే నా నాధుడు కావాలని దేవుని ప్రార్థిస్తున్నా. నాకు ఉత్తమలోక ప్రాప్తికలుగనట్లుమీరు ఆశీర్వదించాలని ప్రార్థించుచున్నాను," అంది. తరువాతఏడుస్తున్ననన్ను చేరదీసి. "నాయినా! కుమారుడు లేనిలోటు నీవు తీర్చావు. మీ అందరినీ విడిచిపోవటా నికి నా మన స్సంగీకరించకపోయినా - కాలధర్మాన్ని అతిక్రమించలేము. మీ నాన్నగారు ఉత్తములు. పరోపకార పరాయణులు. ధీరోదాత్తులు రాచవంశ ములో వారికి వుండవలసిన సుగుణము లన్నీ వారియం దుండుటచేతనే - నేను వారిని కారణ జన్ములని చెబుతున్నాను. నీవు తప్పకుండా వీరి అడుగుజాడల్లో మసలుతూ ఆయనకీర్తిని యినుమడింప జేయాలి నేను నేటితో జీవితాన్ని చాలించబోతున్నాను, నా యడబాటు మీ నాన్నగారికి దుర్భరమైనా - ఆయన ఈ వియోగాన్ని సరిగా నేటికి ఒక సంవ త్సరంవరకు అనుభవించాలి సరిగా ఇదే సమయానికి మీ నాన్నగారుకూడా జీవి తము చాలించగలరు. అంతవరకూ మీరు వారిని భక్తిశ్రద్ధలతో ఏ లోటు రాకండా కాపాడాలి. నా మరణంగురించి మీరు ఏ విధమైన విచారమూ పొందక - నా నిర్యాణం పండుగగా భావించి ఆనం దించాలని కోరుతున్నాను. నా తుది ఘడియలు భగవత్ప్రార్ధనలో గడుపుటకు అనుమతియ్యండి," అని పూజాస్థానంలో కూర్చుంది జపం ప్రారంభించింది.

అప్పటికిగాని అచ్చటివారికి ఆమె వింతచర్యలోని అంతర్యంబోధపడలేదు. అందరి హృదయాలూ విచారభారంతో క్రుంగిపోయాయి. కేవలం శివసాన్నిధ్యం కోసం నిరీక్షిస్తున్న మూర్తీభవించిన పార్వతీదేవిలా వెలిగిపోతోంది. అప్రయత్నంగా అంతా చేతులు జోడించి ఆమెకు అంజలిఘటించారు. బ్రాహ్మణులు వేదపఠనం ప్రారంభించారు. పుణ్యస్త్రీలు హరినామస్మరణ గావిస్తున్నారు మా నాన్న అచేతనుడై యోగ సమాధిలో నున్నాడు. కొందరు పుణ్యస్త్రీలు చేతికందిన పూలతో ఆమెను పూజిస్తున్నారు. గడియారం సరిగా రంగు రంగుమని రెండుకొట్టింది. మా పిన్ని, మా యింటి మహాలక్ష్మి మా ప్రేమ స్వరూపిణి - ఆశ్రిత జనకల్ప వల్లి - క్షుధార్తుల పాలిట అన్నపూర్ణ - నేటి పతివ్రతలలో తలమానికం- మా ఇలవేల్పు సమాధినుండి భర్తపాదము లపై వ్రాలి - జీవితాన్ని చాలించింది

ఈ అపూర్వ సంఘటనకు పట్టణం లోని యావత్తు ప్రజానీకం - సంభ్ర మాత్సర్యములతోవచ్చి - ఆమెదర్శనం చేసుకొని-ఆమెకు భక్త్యాంజలి ఘటించారు ఆమెను పూలవిమానంమీద పురమంతా వూరేగించి - మంచి గంధంతోనూ, తులసి కాష్టంతోనూ దహనపరిచాం.



ఈఘట్టం వర్ణించేటప్పుడు సుందరరావు కన్నులనుండి అశ్రుధారలు కురిశాయి. నాకు అప్రయత్నంగా కనులనుండి వేడిబాష్పాలు రాలాయి. అలాంటి అపూర్వమైన ప్రణయగాధను - నేను ఏ గ్రంథాలలోనో చదవటంతప్ప యిలా ప్రత్యక్షంగా జరిగినట్లు విని ఎరుగను. కన్నులు రుమాలుతో తుడుచుకొని సుందరం చెప్పటం మొదలుపెట్టాడు.

"బ్రతికి వున్నంతవరకూ మమ్మల్ని ఎలా ప్రేమాదరములతో చూచిందో - జీవితానంతరంకూడా ఆమె మాకు యిలవేల్పయి - కష్టసమయాల్లో మమ్మ ఆదుకొని ఆదరిస్తోంది."

"ఆమె పోయిన తరువాత మా కుటుంబం ఆమెలేని లోటును భరించలేక పోయింది. అప్పటినుంచి మానాన్న నిస్పృహాయుడై ఎవరితోనూ మాట్లాడేవాడు కాదు. ఎప్పుడు వ్రాయించిందో కాని - మా కుటుంబంలోని ప్రతి వ్యక్తికీ - పేరు పేరునా తన ఆస్తిలో భాగం చూపించింది. తన జీవితాంతం వరకూ తనకు సపర్యచేసిన దాసదాసీజనానికి కూడా జీవనోపాధి కల్పించింది. ఆ గ్రామంలోని ఆడపిల్లలకు చదువులేని కొరతను తీర్చుటకుగాను ఒక బాలికా పాఠశాలను స్థాపించటానికి కావలసిన నిధిని ఏర్పాటు చేసింది.

ఆమె మా ఇలవేల్పు అనటానికి చాల నిదర్శనాలు చూపించింది. ఒకసారి నాన్న గారికి జీవన్మరణ సమస్య కలిగినప్పుడు. అమ్మ మీద ఆవహించి – నాన్నకు ఆసమయంలో మరణం రాదనీ – సరిగా తను సూచించిన సమయంలోనే జీవితం చాలిస్తాడని చెప్పింది. ఆమెవాక్కు వేద వాక్కులా జరిగింది.

"మాయింట్లో ఏసమయంలో ఎవరికి సుస్తీ చేసినా – తలంచిన మాత్రాన – వారి మంచంవద్ద కూర్చుండి – అదృశ్యం గానే – వారి సేవచేసి – రోగవిముక్తులను చేసేది. తలంచినంతనే వచ్చి ఆదరించి పోయేది. నేటి సంఘటన దానికి నిదర్శన మని నువ్వు అంగీకరించకపోవు."

సుందరం నన్ను తనయింటి ఆవర ణలో దూరంగావున్న బంగళాకు తీసు కొని వెళ్ళాడు. అది సుందరమైన ఉద్యానవనంలోని ఒక దివ్యభవనం. ఆ భవనమంతా చూపించాడు. తన యిల వేల్పు కొల్చిన పూజాపీఠమూ, ఆమె వాడిన పూజా పరికరాలూ, ఆమె వస్త్ర ములూ, శయ్యాతల్పమూ, అన్నీ అతి భద్రంగా కాపాడబడుతున్నాయి.

పూలతోటకు మధ్యగా నున్నచోట, నాలుగు బొగడచెట్లు గుబురుగా పెరిగి యున్నచోట – ఎత్తైన తిన్నెపై రెండు నిలువెత్తు పాలరాతి విగ్రహాలు నిలుప బడి వున్నాయి. అవి రూపంలోనూ, సౌందర్యంలోనూ ఒకదానినొకటి మించి వున్నాయి. కేవలం ప్రబంధాలలోనూ, పురాణాల్లోనూ, కవులు వర్ణించే పవిత్ర ప్రణయ మూర్తులలా వున్నారు. సుందరం చెప్పినట్లు నిజంగా ఏ శాప వశంచేతో దివినుండి భువికి దిగివచ్చిన దేవతల్లా. కారణజన్ములుగా తోచారు.

అప్పుడే ఉదయిస్తున్న బాలభానుని అరుణకాంతులు ఆ శ్వేతమూర్తుల ముఖ బింబములపై బడి ఓ అపూర్వ తేజ స్సును ప్రసరింపజేస్తున్నాయి. వికసిం చిన బొగడపూలు దేవతలు వెదజల్లు కుసుమ వర్షంలా ఆ విగ్రహాలమీద జల జల రాలుతున్నాయి.

ఈ యపూర్వ సుందర దృశ్యాన్ని చూడగానే నా శరీరం పులకితాంతమైనది. అనిర్వచనీయమైన ఆనందం నా హృద యాన్ని నింపింది నాకు తెలియకండానే నేను ఆదివ్య ప్రేమమూర్తుల విగ్రహాల ముందు మోకరించి – వారికి జోహారు లర్పించకుండా వుండలేక పోయాను.